# ప్రణవ పద్మాకరం

ఆగస్ట్ 25







పాఠకులకు

జన్మాష్టమి మరియు వినాయకచవితి శుభాకాంక్షలు

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు



# ఆగస్ట్, 2025

ఆగస్ట్, 2025

## విషయ సూచిక

సంపుటి-4
సంచిక-8

| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 03 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నడుముక్కల శ్రీకరి |
| 04 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 05 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 06 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 07 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 10 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 11 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |

శ్రీ మహాగణాధిపతయే నమః　　శ్రీ గురుభ్యోనమః　　శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




"నేను వైకుంఠాన్ని విడిచి అయినా ఉంటాను కానీ నా భక్తులను మాత్రం విడిచి ఉండలేను" అనేది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిజ్ఞ. స్వామి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటున్న విధానాన్ని కనులకు కట్టి చూపించే అద్భుత రచన 'శ్రీ వెంకటేశ్వర విలాసం'. స్వామి వారి నివాస స్థలమైన తిరుమల, తిరుమల లోని వివిధ తీర్థములు, వివిధ పర్వతములు, దేవాలయములు, వాటి మహత్తుతో పాటు వాటిని దర్శించవలసిన విధి విధానములు సరళంగా, వివరంగా మనసుకు హత్తుకునే విధంగా వివరించ బడిన ఈ గ్రంథం పఠించిన వారు నిస్సందేహంగా ఆధ్యాత్మిక బల సంపన్నులు కాగలరు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

# సంపాదకీయం

## శ్రావణ భాద్రపదాలు - పుణ్యప్రదాలు

**చాంద్రమానం** ప్రకారం ఆగష్టు నెల — శ్రావణ భాద్రపదాలు కలసిన మాసం. ఇవి రెండు అత్యంత పవిత్రమైనవి. శ్రావణమాసంలో మంగళగౌరీ వ్రతం, శ్రీ వరలక్ష్మి వ్రతం, హయగ్రీవ జయంతి, శ్రీకృష్ణాష్టమి మున్నగు పండుగలు ఉన్నాయి. భాద్రపదమాసంలో ఆగష్టు 27 వ తేది నాడు వినాయక చతుర్థి ఏర్పడింది. ఇవన్నీ మానవ జీవిత పరమార్థానికి అత్యావశ్యకాలు. ప్రజలలో ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ, ఐకమత్యాన్నీ పెంపొందించే పండుగలు. ఈ మాసంలో శివపూజ మరియు ఉపవాసాలు ఆధ్యాత్మిక శుద్ధిని కలిగిస్తాయని స్కాంద పురాణం వివరిస్తుంది. ఈ మాసంలో వచ్చే మంగళగౌరీవ్రతం మరియు శ్రీ వరలక్ష్మీవ్రతం స్త్రీలకు సౌభాగ్యం, ఐశ్వర్యం మరియు కుటుంబ సౌఖ్యాన్నీ అందిస్తాయి. మంగళగౌరీవ్రతం సకల మంగళములను అందించే వ్రతం. శ్రావణ మంగళవారాలలో జరుపుకొనవలసిన వ్రతం. స్త్రీలు ప్రత్యేకంగా జరుపుకొనవలసిన వ్రతం. సకల శుభాలను అందించే వ్రతమిది.

**శ్రీ వరలక్ష్మి వ్రతం:** భృగువునకు, ఖ్యాతికి శ్రీమహాలక్ష్మీదేవి శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు కూతురుగా పుట్టింది. ఆ రోజును వరలక్ష్మీవ్రతం జరుపుకోవటమనే సంప్రదాయం ఏర్పడింది. ఈ వ్రతం ఆచరించిన వారికి సంపదలు, సౌభాగ్యం లభిస్తాయి. ఆ రోజు వ్రతం చేయలేక పోయినవారు శ్రావణ మాసంలోని మరొక శుక్రవారం నాడైనా చేసుకొనవచ్చును.

> శ్లో॥ సర్వమంగళమాంగల్యే శివే సర్వార్థసాధికే.
> శరణ్యే త్ర్యంబకే గౌరీ నారాయణి నమోస్తుతే ॥

**హయగ్రీవ జయంతి:** శ్రావణపూర్ణిమ నాడు శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారం ధరించాడు. వేద ప్రచారం చేసాడు. అందువలనే ఈ రోజు వేద కర్మలకు మూల కారణమైన యజ్ఞోపవీతం ధరించడం, వేదం వినడం, గురువందనం అనే కార్యక్రమాలు తప్పనిసరిగా చేసితీరాలని వ్యాసుడు ఆదేశించాడు.

> శ్లోకం: జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్
> ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే ॥

**శ్రీకృష్ణాష్టమి:** జగద్గురువు శ్రీకృష్ణపరమాత్ముడు దుష్టశిక్షణ శిష్టరక్షణ, ధర్మసంరక్షణ కోసం భూలోకంలో ద్వాపరయుగంలో అవతరించిన దివ్య తిథి శ్రావణకృష్ణాష్టమి. 125 సంవత్సరాలు భూలోకంలో నివసించి అనేక మహిమలు చూపి మానవులకు భగవద్గీతను అందించిన శ్రీకృష్ణ పరమాత్ముని జన్మతిథిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి. కృష్ణానుగ్రహం ఉంటే సకల దేవతానుగ్రహం ఉన్నట్లే.

> శ్లో॥ వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్.
> దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

**భాద్రపదమాసం: వినాయక చతుర్థి**

ఆదిపూజ్యుడు సకల విఘ్న వినాశకుడు శ్రీ గణేశుడు అవతరించిన దివ్య తిథి భాద్రపద శుద్ధ చతుర్థి. గణేశ పూజ చేయనిదే, గణేశుని స్తుతించనిదే ఏ కార్యక్రమాలను తలపెట్టరాదని శ్రీకృష్ణుడు వివరించాడు. శ్రీమద్భాగవతంలో క్షీరసాగరమథన ఘట్టంలో వినాయకానుగ్రహం లేకపోవటం వల్లే మంథర పర్వతం సముద్రంలో కుంగిపోయిందని శ్రీమహావిష్ణువు దేవతలతో అంటాడు. అందువల్ల తప్పక విఘ్నేశ్వరపూజ చేయవలసిందే. ఆయనను అర్చించి కథాక్షతలు శిరస్సున జల్లుకొన్నవాడు ఆ ఏడాదంతా విఘ్నాలను తొలగించుకొని కార్యసిద్ధిని పొందుతాడు. శాస్త్రాలను నమ్మి, గురువాక్యంతు కర్తవ్యం అని భావించి భక్తులందరూ తమ తమ జీవితాలను పవిత్రంగా గడిపి ఇహపరాలను పొందాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.....



# శ్రీ గణేశ పురాణం

శ్లోII గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురురేవ పరం బ్రహ్మా గురుర్భాస్కర రూపకః
గురుశ్చంద్రః తథేంద్రశ్చ వాయుశ్చ వరుణోఽనలః
సర్వరూపోహి భగవాన్ పరమాత్మా స్వయం గురుః II
(బ్ర.వై.పు.తృతీయ ఖండం.అ.44.శ్లో.70,71)

గురువు బ్రహ్మా. గురువే విష్ణువు. గురువే మహేశ్వర దేవుడు. గురువు త్రిమూర్తులకు అతీతుడైన పరబ్రహ్మా. సూర్యుడు. చంద్రుడు. ఇంద్రుడు. వాయువు. వరుణుడు. అగ్ని. సర్వ స్వరూపుడైన భగవంతుడు గురువు. గురువు ప్రత్యక్షదైవం. అటువంటి గురువునకు ప్రదక్షిణం చేయడం భూమండలం చుట్టూ ప్రదక్షిణ చేయడంతో సమానం.

శ్లోII నాస్తి వేదాత్పరం శాస్త్రం న హి కృష్ణాత్పరః సురః
నాస్తి గంగా సమం తీర్థం న పుష్పం తులసీ దళాత్ II
(బ్ర.వై.పు.తృతీయఖండం.అ.44.శ్లో.72)

వేదం కంటె గొప్ప శాస్త్రం, కృష్ణుని మించిన దేవుడు, గంగతో సమానమైన తీర్థం, తులసీదళంతో సమానమైన పుష్పం ఎక్కాడా లేవు. భూమితో సాటి వచ్చే ఓర్పు కల వస్తువు, పుత్రుని కంటె ప్రియమైన వస్తువు, దైవం కంటె గొప్పశక్తి, ఏకాదశీవ్రతాన్ని మించిన వ్రతం, శాలగ్రామానికి సాటివచ్చే యంత్రం, భారత దేశం వంటి క్షేత్రం, బృందావనం వంటి పుణ్యస్థలం, కాశికి సాటియైన మోక్షభూమి, వైష్ణవులలో శివునికి సాటియైనవాడు, పార్వతికి మించిన సాధ్వి, ఇంద్రియ నిగ్రహం కలిగినవారిలో గణపతికి సాటియైనవాడు లోకంలో ఉండరు. విద్య కంటె మించిన బంధువు, గురువును మించిన వాడులేడు.

శ్లోII న చ విద్యా సమో బంధుః, నాస్తి కశ్చిద్గురోః పరః II
(బ్ర.వై.పు.తృతీయఖండం.అ.44.శ్లో.76)

అందువల్లనే విద్యను ప్రసాదించిన గురువును ఎలా గౌరవిస్తామో అలాగే గురుపత్నిని, గురువు సంతానాన్ని గౌరవించాలి. పరశురాముడు గురుపత్ని అయిన పార్వతిని, గురుపుత్రుడైన గణపతిని హేళన చేసాడు. ఆ దోషాన్ని సరి చేయడానికి నీ ఇంటికి వచ్చాను అని బాలుని వేషంలో ఉన్న విష్ణువు పలికాడు. అనంతరం పార్వతీదేవి కోపాన్ని తొలగిస్తూ ప్రీతి పూర్వకంగా విష్ణువు జగన్మాతతో ఇలా అన్నాడు — జగన్మాతా! మంగళదేవీ! సర్వమంగళా! నీవు రాగద్వేషాలకు అతీతురాలవు. గణపతి, కుమారుడు ఎటువంటివారో భార్గవరాముడు కూడా అటువంటి వాడే. మీ పార్వతీపరమేశ్వరులు వీరందరినీ సమానంగా చూస్తారు. భేదబుద్ధి చూపించరు. అయిందేదో అయ్యింది. సర్వం నీకు తెలిసే జరుగుతున్నది. ఇక నుండి మహాత్ముడైన గణపతి ఏకదంతుడు అని పిలవబడతాడు. దేవతలందఱూ అతడిని ఈ పవిత్ర నామంతో కీర్తించి, గౌరవిస్తారు.



.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

**వేంకటాద్రికి** సమానమైన దివ్యక్షేత్రం బ్రహ్మాండంలో మరొకటిలేదు. వేంకటాద్రిని తలచుకొన్నా, ఆ క్షేత్రమహిమను పొగడినా, ఆ క్షేత్ర కథలను విన్నా, పారాయణం చేసినా, ఇతరులకు వినిపించినా, సకల పాపాలు నశిస్తాయి. వేంకటాద్రికి నమస్కారం చేసినంత మాత్రాన సకల సుభాలు లభిస్తాయి. దేవతలు అనుదినమూ వేంకటాద్రికి అదృశ్యరూపంలో వచ్చి స్వామి వారిని దర్శించి వెళ్ళిపోతుంటారు. వేంకటాద్రిలో భువనబ్రహ్మాండాలలో గల అన్ని తీర్థాలు ఉన్నాయి. అన్ని మంత్రాలు ఉన్నాయి. అన్ని అవతారాలు ఉన్నాయి. ఇది ఉత్తమ తీర్థం. వేంకటేశ్వరుని వైభవమును విన్నవాడు ఘోరపాపాలనుండి విముక్తుడవుతాడు. ముక్తి పొందుతాడు. వేంకటేశ్వరుని నామ గుణ సంకీర్తనము కోటి తపోదానయజ్ఞ సమము.

శ్లోII శ్రీవేంకటేశ్వరం దేవం యః పశ్యతి సకృన్నరః
సనరో ముక్తిమాప్నోతి విష్ణుసాయుజ్యమాప్నుయాత్ II
(స్కాం.పు.వేం.మా.అ.18.శ్లో.౨)

శ్రీవేంకటేశ్వరుని భక్తితో ఒకే ఒక్కసారి చూచినా చాలు. చూచిన వాడు ముక్తి పొందుతాడు. విష్ణుసాయుజ్యం పొందుతాడు. కృతయుగంలో పది సంవత్సరాలు కష్టపడి తపస్సులు, జపాలు చేయడం వల్ల వచ్చే పుణ్యం త్రేతాయుగంలో మానవునకు ఒక్క సంవత్సరంలోనే లభిస్తుంది. అదే పుణ్యం ద్వాపరయుగంలో ఐదు నెలలో లభిస్తుంది. ఆ పుణ్యమే కలియుగంలో కేవలం ఒకే ఒక్క దినములో మానవుడు పొందగలడు. ఆ పుణ్యానికి కోటిరెట్ల పుణ్యం శ్రీనివాసుని ఒక్క సారి భక్తితో చూడడం వల్ల భక్తుడు అయిన మానవుడు కేవలం ఒక్క నిమిషంలో పొందగలడు. శ్రీవేంకటేశ్వరుని మహామహిమ అటువంటిది. శ్రీశ్రీనివాసుని దివ్య కరుణ అపారమైనది. శ్రీశ్రీనివాసుడు కలియుగంలో, శ్రీమహాలక్ష్మి కంటె, వైకుంఠం కంటె, గరుడుని కంటె, సనకసనందనాది మునులకంటె, నారదుని కంటె, హనుమంతుని కంటె, భూలోకంలో తనకై తపించిపోతూ, తననే తలచుకొనే భక్త జనులను ఎక్కువగా కరుణిస్తాడు. అందుకనే కలిలో హరిభక్తుడు అందరికంటె ధన్యుడు.

....ఇంకా ఉంది



## అనసూయ

**త్రిమూర్తులు** పసిపాపలుగా అయ్యారు. తన పాతివ్రత్య మహిమతో అపుడు ఆ పిల్లలకు పాల బువ్వ పెట్టింది. ఆమె పాతివ్రత్య శక్తి ముందు వారి ప్రయత్నం నెరవేరలేదు. త్రిమూర్తులను పసిపిల్లలుగా మార్చి తన పాతివ్రత్య శక్తిని నిరూపించుకుంది. అనసూయ భక్తికి మెచ్చిన త్రిమూర్తులు ఆమెకు వరం ప్రసాదించారు. ఆమె కోరిక మేరకు త్రిమూర్తులు అంశతో దత్తాత్రేయుడు జన్మించాడు. దత్తాత్రేయుడు గొప్ప గురువుగా, యోగిగా ప్రసిద్ధి చెందాడు. శ్రీరాముడు సీతాలక్ష్మణులతో కలసి తండ్రి ఆజ్ఞను అనుసరించి, అరణ్యవాసం పదునాలుగు సంవత్సరాలు గడపుటకై చిత్రకూటం దాటి మహాముని అత్రి, అనసూయల ఆశ్రమం చేరుకొని మార్గమధ్యంలో వారి ఆశీస్సులకై వేంచేసి ఉన్నారు. ఆ సమయంలో అత్రి, అనసూయాదేవి. సీతారామలక్ష్మణులను ఆనందంతో ఆహ్వానించారు. అంతటి మహాసాధ్వి ఉత్తమగృహిణియైన అనసూయ, తమను చూడవచ్చిన సీతారామలక్ష్మణులకు చక్కగా అతిథి సత్కారాలు గావించింది. అనసూయ సీతతో "భర్తను మించిన దైవం లేదు. ఎల్లవేళలా భర్తకు తోడై ఉండు" అని ఆశీర్వదించింది. "సీతారామచరిత్ర సర్వలోకాలకు పూజనీయమౌతుందని" దీవించింది - అనసూయదేవి. సీతను సాక్షాత్తు లక్ష్మీదేవిగా గుర్తించి, తనవద్ద నున్న దివ్యమాలలు, వస్త్రాభరణాలు, బహూకరించింది. ఆ పువ్వులు ఎప్పటికీ వాడవు. ఆ వస్త్రాలు ఎప్పటికీ మాయవు. అట్టి మహిమాన్వితమైన, విలువైన బహుమతులు ఇచ్చి, దీవించి పంపారు. అనసూయ తన జీవితం ద్వారా స్త్రీలకు ఎన్నో గొప్ప విషయాలను బోధించింది. భర్తను దైవంగా భావించడం, అతిథులను గౌరవించడం, ఓర్పు, సహనం కలిగి ఉండటం వంటి విషయాలను ఆమె తన ప్రవర్తన ద్వారా తెలియజేసింది. అనసూయ జీవితం నేటి సమాజంలో స్త్రీలకు ఒక ఆదర్శం. భార్య భర్తను ఎలా ప్రేమించాలి, గౌరవించాలి అనే విషయాలను ఆమె జీవితం ద్వారా తెలుసుకోవచ్చు. అనసూయ కథ స్త్రీలకు స్ఫూర్తినిచ్చే ఒక గొప్ప ఉదాహరణ. నేటి సమాజంలో కుటుంబ విలువలు క్షీణిస్తున్న సమయంలో, అనసూయ వంటి గొప్ప మహిళల జీవితం మనకు మార్గదర్శకంగా ఉంటుంది.




# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః　　శ్రీ మాత్రేనమః　　శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 345. క్షేత్రపాల సమర్చితా – (ఓం ఐం హ్రీం శ్రీం క్షేత్రపాల సమర్చితాయైనమః)



దివ్య స్థలాలను క్షేత్రములు అంటారు. ప్రతి క్షేత్రానికి ఒక క్షేత్రపాలకుడు ఉంటాడు. కాశీ క్షేత్రానికి పాలకుడు కాలభైరవుడు. ఇటువంటి సకల క్షేత్రపాలకుల చేతా పూజింపబడునది అమ్మవారు. క్షేత్రపాలుడు అనబడే ఒక శివావతారం కూడా ఉంది. శివుని అవతార మూర్తి అయిన క్షేత్రపాలునిచే అమ్మవారు పూజింపబడుతున్నదని మరొక అర్థం. క్షేత్రమనగా శరీరం. భగవద్గీతలో ఇదం శరీరం కౌంతేయ! క్షేత్ర మిత్యభి ధీయతే అని శ్రీకృష్ణ పరమాత్ముడు అన్నాడు. ఈ శరీరం క్షేత్రం అనబడుతుంది. ఈ క్షేత్రానికి పాలకుడు పంచ వ్యాహృతులతో కూడిన ఆత్ముడు. ఆత్మ చేత లేక ఆత్మ యందు చక్కగా పూజింపబడునది అమ్మ అని నిగూఢార్థం.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

ఇల్లు కట్టడం ఆరంభించి ఇల్లు పూర్తవ్వక, అప్పులు తట్టుకోలేక బాధపడేవారు 41 రోజులు శ్రీమహాగణేశుని పటం ఎదురుగా పెట్టుకొని, అటుకులు, బెల్లం నివేదించి, ఈ మంత్రాన్ని రోజూ 1008 సార్లు జపిస్తూ కలువలు, తామరపూలు, మందారపూలతో పూజిస్తే అప్పులు తీరి ఇల్లు కట్టుకోవడం పూర్తి చేసుకొని సుఖపడగలుగుతారు. ఇల్లు అద్దెకు ఇవ్వాలనుకొన్నా, ఎవ్వరూ అందులోకి దిగకపోతే ఈ మంత్రాన్ని ఆ ఇంటిలో ఒకరోజు 1008 సార్లు జపించండి. మంచివ్యక్తులు అద్దెకు దిగుతారు. నిత్యం 11 సార్లు ఈ మంత్రాన్ని పారాయణ చేస్తే పనులలో విఘ్నాలు ఉండవు.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## అగస్త్యమహర్షి

**అగస్త్యుడి** భార్య విదర్భ రాజ్యానికి చెందిన యువరాణి లోపాముద్ర. ప్రారంభంలో, ఆమె తల్లిదండ్రులు ఈ వివాహాన్ని వ్యతిరేకించారు, కానీ లోపాముద్ర అగస్త్యుడిని తన భర్తగా అంగీకరించింది. వారికి దృఢస్యుడు అనే కుమారుడు జన్మించాడు, తల్లి గర్భంలో ఉండగానే వేదాలు నేర్చుకుని జన్మించిన పిల్లవాడిగా మహాభారతంలో ప్రస్తావించబడ్డాడు.

మేరు పర్వతం అన్నింటికన్నా ఎత్తైన పర్వతం. దాని ఎత్తును చూసి భరించలేక ఈర్ష్యతో వింధ్యపర్వతం కూడా దానికంటే ఎత్తుగా ఎదిగి సూర్యుని గమనాన్ని కూడా అడ్డగించసాగింది. దీంతో రాత్రింబవళ్ళూ సక్రమంగా రాక వేద విధులకు ఆటంకం కలగసాగింది. అప్పుడు దేవతలందరూ కలిసి అగస్త్యమునిని ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించిన అగస్త్యుడు తన భార్యతో కలిసి ఆ పర్వతం వద్దకు వచ్చాడు. తాము దక్షిణ దిశగా వెళుతున్నామనీ, అంత పెద్ద పర్వతాన్ని ఎక్కి దిగలేమనీ దాని ఎత్తుని తగ్గించుకోమన్నారు. మహర్షులంటే భక్తి ప్రపత్తులు గల వింధ్యుడు తక్షణమే తన ఎత్తుని ఉపసంహరించుకుని వెంటనే వారు నడచి వెళ్ళడానికి వీలుగా దారి ఇచ్చాడు. తర్వాత అగస్త్యుడు తాము మరలా తిరిగి ఉత్తర దిశగా తిరిగి వస్తామని అప్పటిదాకా అలాగే ఉండమని చెప్పాడు. కానీ మళ్ళీ తిరిగి రానేలేదు. అప్పటి నుంచీ ఇప్పటిదాకా ఆ పర్వతం అలాగే ఉంది. వేరొక కథనం ప్రకారం, శివ పార్వతుల కళ్యాణానికి ఋషులందరు హిమాలయాలకు వచ్చారు. అప్పుడు వారి శక్తికి ఉత్తరాన భూమి క్రుంగి పోవుచుండడం చూసి శివుడు అందరి శక్తికి ఇంచుమించు సమానమైన అగస్త్యభగవానులను దక్షిణ దిక్కున ఉండమని ఆదేశమిచ్చారు. అప్పుడు అగస్త్యులవారు కళ్యాణం చూడలేక పోతున్నందుకు చింతించుచుండగా వారికి అక్కడనుండి కూడా ప్రత్యక్షంగా చూసే వరాన్ని ప్రసాదించారు. అప్పటి నుండి అగస్త్య మహర్షి దక్షిణాన ఉన్నారు.

### వాతాపి, ఇల్వలుల కథ

ఒకానొకప్పుడు వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు నివసించేవారు.
వీరు అడవిలో నివసిస్తూ దారిన పోయే బాటసారులను ఒక విచిత్రమైన రీతిలో చంపి తినేవారు. వాతాపికి కామరూప విద్య (సులభంగా తను కోరుకున్న జీవి రూపంలోకి మారే విద్య) తెలుసు. ఇల్వలుడికి చనిపోయినవారిని బ్రతికించే సంజీవనీ విద్య తెలుసు. ఎవరైనా బాటసారి వచ్చినపుడు వాతాపి ఒక మేక రూపంలోకి మారిపోయేవాడు. ఇల్వలుడు ఒక బ్రహ్మచారి వేషం వేసుకుని అతిథులను భోజనానికి ఆహ్వానించేవాడు. వారు ఆ మేక మాంసాన్ని ఆరగించగానే ఇల్వలుడు వాతాపిని బ్రతికించడానికి సంజీవనీ మంత్రం పఠించేవాడు. అప్పుడు వాతాపి ఆ బాటసారి పొట్టను చీల్చుకుని బయటకు వచ్చేసేవాడు. అలా ఒక సారి అగస్త్యుడు ఆ అరణ్యం గుండా వెళుతుండగా ఈ రాక్షస సోదరులు గమనించారు. మహర్షిని విందుకు ఆహ్వానించి అందరికీలానే మేక మాంసం వడ్డించాడు ఇల్వలుడు. అతను భోంచేసిన తరువాత ఇల్వలుడు యథావిధిగా వాతాపిని బయటకు రప్పించడానికి సంజీవనీ మంత్రం పఠించాడు. కానీ వాతాపి మాత్రం తిరిగి రాలేదు. ఎందుకంటే ఈ విషయం ముందుగా తెలుసుకున్న అగస్త్యుడు 'జీర్ణం జీర్ణం', 'వాతాపి జీర్ణం' అనగానే వాతాపి జీర్ణమైపోయాడని ఇల్వలుడికి తెలియజేసాడు.

.ఇంకావుంది

## దివోదాసుని వృత్తాంతం



**విఘ్నేశ్వరుడు** 56 రూపములను ధరించి కాశీ యందు నివసించసాగాడు. ఎనిమిది ఆవరణములుగా 56 రూపములతో గణపతి కాశీయందు స్థిరముగా నివాసముండెను. ఒక్కొక్క ఆవరణలో ఎనిమిది గణపతి రూపములను ధరించి కాశీక్షేత్రంలో ఉంటూ ఈనాటికీ భక్తులను అనుగ్రహిస్తున్నారు. మంథర పర్వతం నుండి గౌరీ సమేతుడై కాశీ వచ్చిన శివుడు. గణపతిని స్తుతించెను

### ఢుండి గణపతి స్తోత్రం

జయ విఘ్నకృతామాద్య భక్త నిర్విఘ్నకారక|

అవిఘ్న విఘ్నశమన మహావిఘ్నైక విఘ్నకృత్ ||1||

జయ సర్వ గణాధీశ జయ సర్వ గణాగ్రణీః|

గణప్రణత పాదాబ్జ గణనాతీత సద్గుణ ||2||

జయ సర్వగ సర్వేశ సర్వ బుద్ధ్యేక శేవథే|

సర్వమంగళ మాంగళ్య జయ త్వం సర్వమంగళ|

అమంగళోపశమన మహామంగళ హేతుక ||4||

జయ సృష్టి కృతాం వంద్య జయస్థితి కృతా నత|

జయ సంహృతి కృత్ స్తుత్య జయ సత్కర్మసిద్ధిద ||5||

సిద్ధవంద్య పదాంభోజ జయ సిద్ధి వినాయక|

సర్వ సిద్ధ్యేక నిలయ మహా సిద్ధ్యృద్ధి సూచక ||6||

అశేష గుణ నిర్మాణ గుణాతీత గుణాగ్రణీః|

పరిపూర్ణ చరిత్రార్థ జయ త్వం గుణవర్ణిత ||7||

జయ సర్వ బలాధీశ బలారాతి బలప్రద|

బలాకోజ్జ్వల దంతాగ్ర బాలాబాల పరాక్రమ ||8||

# కాశీ కథలు

అనంత మహిమాధార ధరాధరవిచారణ|

దంతాగ్రప్రోతదిజ్ఞాగజయ నాగవిభూషణ ||౯||

యే త్వం నమంతి కరుణామయ దివ్యమూర్తే

సర్వైనసామపి భువో భువి ముక్తి భాజః|

తేషాం సదివ హరసీహ మహోపసర్గాన్!

స్వర్గాపవర్గమపి సంప్రదదాసి తేభ్యః ||10||

యే విఘ్నరాజ భవతా కరుణా కటాక్షైః

సంప్రేక్షితాః క్షితిటేల్ క్షణమాత్రమత్ర|

తేషాం క్షయంతి సకలాన్యపి కిల్బిషాణి

లక్ష్మీః కటాక్షయతి తాన్పురుషోత్తమాన్ హి ||11||

యేత్వాం స్తువంతి నత విఘ్న విఘాత దక్ష

దాక్షాయణీ హృదయ పంకజ తిగ్మరశ్మే|

శ్రూయంత ఏవ త ఇహ ప్రథితా న చిత్రం

చిత్రం తదత్ర గణపా యదహో త ఏవ ||1౨||

యే శీలయంతి సతతం భవతోంఘ్రి యుగ్మం

తే పుత్రా పౌత్ర ధనధాన్య సమృద్ధి భాజః|

సంశీలితాంఘ్రి కమలా బహుభృత్య వర్గైః

భూపాల భోగ్య కమలాం విమలాం లభంతే ||13||

త్వం కారణం పరమకారణ కారణానాం

వేద్యోఽసి వేద విదుషాం సతతం త్వమేకః|

త్వం మార్గణీయ మసి కించన మూల వాచాం

వాచామగోచర చరాచర దివ్యమూర్తే ||14||

వేదా విదంతి న యథార్థ తయా భవంతం

బ్రహ్మాదయోపి న చరాచర సూత్రధార|

త్వం హంసి పాసి విదధాసి సమస్తమేకః

కస్తే స్తుతి వ్యతికరో మనసాప్యగమ్య ||15||

త్వద్దుష్టదృష్టి విశిఖైః నిహతాన్నిహన్మి

దైత్యాన్ పురాంధక జలంధర ముఖ్యకాంశ్చ|

కస్యాస్తి శక్తిరిహ యస్య దృతేఽపై తుచ్ఛం

వాంఛేద్విధాతుమిహ సిద్ధిద కార్యజాతం ||16||

అన్వేషణే ఢుంఢిరయం ప్రథితోఽస్తి ధాతుః

సర్వార్థ ఢుంఢితతయా తవ ఢుంఢినామ|

కాశీ ప్రవేశమపి కో లభతేఽత్ర దేహీ

తోషం వినా తవ వినాయక ఢుంఢిరాజ ||17||

ఢుంఢే ప్రణమ్య పురతస్తవ పాదపద్మం

యో మాం నమస్యతి పుమానిహ కాశివాసీ|

తత్కర్ణమూల మధిగమ్య పురా దిశామి

తత్ కించిదత్ర న పునర్భవతాస్తి యేన ||18||

స్నాత్వా నరః ప్రథమతో మణికర్ణికాయా

ముద్ధూళితాఘ్రి యుగళస్తు సచైలమాశు|

దేవర్షి మానవ పిత్రూనపి తర్పయిత్వా

జ్ఞానోదతీర్థమభిలభ్య భజేత్తతస్త్వాం ||1౯||

సమోద మోదక భరైర్వర ధూపదీపై

రామ్యైః సుగంధ బహుళైరనులేపనైశ్చ |

సంప్రీణ్య కాశినగరీ ఫలదాన దక్షం

ప్రోక్త్వాథ మా క ఇహ సిధ్యతినైవ ఢుండే ||౨౦||

తీర్థాంతరాణి చ తతః క్రమవర్జితోఽపి

సంసాధయన్నిహ భవత్కరుణా కటాక్షైః |

దూరీకృత స్వహిత ఘాత్యుపసర్గవర్గో

ఢుండే లభే దవికలం ఫలమత్ర కాశ్యాం ||౨౧||

యః ప్రత్యహం నమతి ఢుంఢి వినాయకం త్వాం

కాశ్యాం ప్రగే ప్రతిహతాఖిల విఘ్నసంఘః |

నో తస్య జాతు జగతీతలవర్తివస్తు

దుష్ప్రాపమత్ర చ పరత్రచ కించనాపై ||౨౨||

యో నామ తే జపతి ఢుంఢివినాయకస్య

తమ్ వై జపంత్యనుదినం హృది సిద్ధయోఽష్టా |

భోగాన్ విభుజ్య వివిధాన్ విబుధోప భోగ్యాన్

నిర్వాణయా కమలయా ప్రియతే స చాంతే ||౨౩||

దూరేస్థితోఽప్యహరహస్తవ పాదపీఠం

యః సంస్మరేత్సకల సిద్ధిద ఢుంఢిరాజ |

కాశీ స్థితే రవికలం సఫలం లభేత్

నైవాన్యథా న వితథా మమ వాక్యదాచిత్||౨౪||

ఈ స్తోత్రమును భక్తి శ్రద్ధలతో విన్నవారికి ఎటువంటి విఘ్నములు కలుగవు కాశీ యందు దుంఢి రాజ గణపతి సన్నిధిలో ఈ స్తోత్రమును చదివినవారికి అనేక శుభములు కలుగుతాయి ఈ స్తోత్రమును పారాయణ చేసిన వారికి పుత్ర,భార్య,గృహ వాహన,ధన, ధాన్యాలు లభిస్తాయి .



.ఇంకాఉంది

# శ్రీ గణనాయకాష్టకమ్

1. ఏకదంతం మహాకాయం తప్తకాంచనసన్నిభమ్ l

లంబోదరం విశాలాక్షం వందేహం గణనాయకమ్ ll

2. మౌంజీ కృష్ణాజినధరం నాగయజ్ఞోపవీతినమ్ l

బాలేందుశకలం మౌళౌ వందేహం గణనాయకమ్ ll

3. చిత్రరత్నవిచిత్రాంగం చిత్రమాలా విభూషితమ్ l

కామరూపధరం దేవం వందే హం గణనాయకమ్ ll

4. గజవక్త్రం సురశ్రేష్ఠం కర్ణచామర భూషితమ్ l

పాశాంకుశధరం దేవం వందేహం గణనాయకమ్ ll

5. మూషకోత్తమమారుహ్య దేవాసురమహాహవే l

యోద్ధుకామం మహావీరం వందేహం గణనాయకమ్ ll

6. యక్షకిన్నర గంధర్వ సిద్ధవిద్యాధరైస్సదా l

స్తూయమానం మహాబాహుం వందేహం గణనాయకమ్ ll

7. అంబికాహృదయానందం మాతృభిః పరివేష్టితమ్ l

భక్తప్రియం మదోన్మత్తం వందేహం గణనాయకమ్ ll

8. సర్వవిఘ్నహరం దేవం సర్వవిఘ్న వివర్జితమ్ l

సర్వసిద్ధిప్రదాతారం వందేహం గణనాయకమ్ ll

గణాష్టకమిదం పుణ్యం యః పఠేత్ సతతం నరఃl

సిధ్యంతి సర్వకార్యాణి విద్యావాన్ ధనవాన్ భవేత్ ll

ప్రణవ పద్మాకరం

# గురుదేవుల జీవన కవనము

## ద్వాత్రింశతిః అధ్యాయః



ఆషాడ శుద్ధ ఏకాదశినాడు స్వగృహములో గురుదేవులు అంగరంగ వైభవంగా ప్రతిష్ఠ చేసారు, వచ్చేవారి కష్టములు తొలగి శుభాలు కలుగుతుండటంతో భక్తుల సంఖ్య తక్కువ కాలంలోనే పెరిగింది.కరుణ చూపించే గురువుగారు,దర్శన మాత్రంతోనే కష్టములు నుండి బయట పడవేస్తున్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వందల సంఖ్యలో ప్రతి రోజూ వచ్చేవారు. భక్తులకు గురువు గారి ఇల్లు సరిపోవడం లేదు.అందువల్ల గురువు గారు అమ్మవారి కృపతో ప్రణవ పీఠాన్ని విస్తరించాలి అనుకున్నారు.అందుకు గురుదేవులకు స్థలం అవసరమైంది. అదే సమయంలో అమ్మవారు కూడా గురువు గారికి కాంతి రూపంలో దర్శనమిచ్చి ప్రణవ పీఠం స్థాపనకు ఆశీస్సులు అందించారు.2005 వ సంవత్సరంలో ఒక భక్తుడు తన స్థల పరిశీలన కోసం గురుదేవులను ఆశ్రయించగా,గురువు గారు ఆ భక్తుడితో కలిసి ఆ భక్తుడి స్థల పరిశీలనకు వెళ్లారు.అక్కడే గురుదేవులకు ఒక దివ్యస్థలం కనిపించింది,ఆ దివ్యస్థలమునందు శ్రీ ప్రణవ పీఠమును స్థాపించాలని గురుదేవులు సంకల్పించారు. అనేక మంది భక్తులు తమ స్థలమును ఇవ్వాలనుకున్నా గురువు గారు చూసిన స్థలమును ఎంపిక చేసుకున్నారు. 2006 నుండి 2010 వరకు గురుదేవులు శ్రీ ప్రణవ పీఠం స్థాపన కొరకు అవిశ్రాంతంగా కృషి చేసారు.అనేక చోట్ల ప్రవచనాలు చెప్పారు, అవధానాలు చేసారు,టీవీ కార్యక్రమాల లో పాల్గొన్నారు. ఇలా రాత్రీ,పగలు గురువు గారు పీఠ స్థాపన కొరకు కష్టించారు. శ్రీ ప్రణవ పీఠం భూమి పూజా కార్యక్రమాల్లో ఒక విచిత్రం చోటుచేసుకుంది.ఆ స్థలమునకు దగ్గరగా ఉన్న గుడిసెలో ఉంటున్న ఒక బాలుడికి మాటలు వచ్చేవి కావు.ఆ పూజా కార్యక్రమంలో హఠాత్తుగా ఆ బాలుడు మాట్లాడటం మొదలుపెట్టాడు.ఇది ఒక అద్భుతమైన విషయం,అమ్మవారి కృప.ఆ బాలుడికి వైద్యం చేస్తున్న వైద్యుడు ఈ విషయం తెలుసుకొని అమ్మవారిపై భక్తితో పీఠస్థాపనకు విరాళము ఇచ్చారు

... ఇంకా ఉంది